
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

సోమవారం । 13 । ఫిబ్రవరి । 2023



65.340 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో ఆదివారానికి 65.340 టీఎంసీలు ఉన్నాయి. 1068 క్యూసెక్కుల వరద వస్తోంది. పెన్నార్ డెల్టాకు 1920, ఉత్తరకాలువకు 730, దక్షిణకాలువకు 320, కండలేరుకు 50 క్యూసెక్కుల వంతున విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.58,930
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.5,264
3 శాతం జీఎస్టీతో	రూ.5,422
నవర (8 గ్రా)	రూ.43,376

వాతావరణం

గరిష్టం/కనిష్టం 32.0 /22.7

జిల్లా వ్యాప్తంగా సోమవారం వాతావరణం పొడిగా ఉంటుంది. పగటి, రాత్రి ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. గాలిలో తేమ 70 శాతం ఉంది.

న్యూస్‌రీల్

ఎన్నికల విధులకు నోడల్ అధికారుల నియామకం

నెల్లూరు(అర్బన్): త్వరలో జరగనున్న తూర్పు రాయలసీమ పట్టభద్రుల, ఉపాధ్యాయ, స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల బాధ్యతలు నిర్వర్తించేందుకు ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నోడల్ ఆఫీసర్లను నియమిస్తూ కలెక్టర్ చక్రధర్‌బాబు ఆదివారం ఆదేశాలు జారీ చేశారు. ఇంప్లిమెంట్ అధికారిగా నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ డి.హరితను నియమించారు. ఫిర్యాదుల కోసం సి-విజిల్ అధికారిగా కేఆర్‌ఆర్‌సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పూర్ణిమను నియమించారు. వచ్చిన ఫిర్యాదులను పరిశీలించడానికి, మీడియాలో వచ్చిన వార్తల ఆధారంగా విచారించి చర్యలు చేపట్టడానికి పరిశ్రమలశాఖ జీఎం ఎస్‌ఎస్‌ఆర్‌సీఎం ప్రసాద్‌ను నియమించారు. మ్యాన్‌పవర్ మేనేజ్‌మెంట్ అధికారిగా డీఆర్వో వెంకట నారాయణమ్మను, ఎస్‌ఎంఎస్ మానిటరింగ్, కమ్యూనికేషన్ ప్లాన్ అధికారిగా కనకదుర్గాభవానిని, మైక్రో అబ్జర్వర్‌గా లీడ్ బ్యాంకు మేనేజర్ శ్రీకాంత్‌ప్రదీప్‌కుమార్‌ను నియమించారు. 20 రకాల విధులకు 20 మంది అధికారులను, వీరికి సపోర్టుగా మరికొంతమంది అధికారులను నియమించారు.

మెరుగైన ఫలితాలు సాధిస్తాం

- డీఈఓ గంగాభవాని బాధ్యతల స్వీకరణ



డీఈఓగా బాధ్యతలు స్వీకరిస్తున్న గంగాభవాని

నెల్లూరు (టౌన్): ఈ విద్యా సంవత్సరంలో పదో తరగతి పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధిస్తామని డీఈఓ గంగాభవాని తెలిపారు. ఆదివారం ఆమె జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో డీఈఓగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో పనిచేస్తున్న ఏడీలు, సూపరింటెండెంట్‌లు, పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఆమెను మర్యాద పూర్వకంగా కలిసి అభినందించారు. ఆమె మాట్లాడుతూ ఉపాధ్యాయులను సమన్వయం చేసి చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారికి ప్రత్యేక తరగతులు నిర్వహిస్తామని తెలిపారు. ఇప్పటికే ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు జిల్లా పరిషత్ ఆధ్వర్యంలో 10వ తరగతి విద్యార్థులను ప్రత్యేక మెటీరియల్ అందజేసామన్నారు. ప్రభుత్వ పాఠశాలలో అమలవుతున్న సంక్షేమ పథకాలను ప్రతి విద్యార్థికి సకాలంలో అందించే విధంగా చూస్తామన్నారు.

కలెక్టరేట్ స్పందన రద్దు

నెల్లూరు (అర్బన్): ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు ప్రతి సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమాన్ని కలెక్టర్ ఆదేశాల మేరకు రద్దు చేస్తున్నట్టు డీఆర్‌ఓ వెంకటనారాయణమ్మ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలెవరూ కలెక్టరేట్‌కు రావద్దని కోరారు.

పోలీస్ స్పందన కూడా..

నెల్లూరు (వీఆర్సీసెంటర్): జిల్లాలో ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం జరగాల్సిన స్పందన కార్యక్రమాన్ని వాయిదా వేసినట్లు ఆదివారం పోలీస్ అధికారులు తెలిపారు. ఈ విషయాన్ని జిల్లా ప్రజలు తెలుసుకోవాలని జిల్లా పోలీసు కార్యాలయ అధికారులు ఒక ప్రకటనలో తెలియజేశారు.

పేకాట కేంద్రంపై దాడి

- పోలీసుల నుంచి తప్పించుకోబోయి..
- భవనంపై నుంచి కిందపడి యువకుడికి తీవ్రగాయాలు

సాక్షిప్రతినిధి, నెల్లూరు: ఓ పేకాట కేంద్రంపై పోలీసులు ఆదివారం దాడి చేశారు. పోలీసుల నుంచి తప్పించుకునే క్రమంలో ఓ యువకుడు భవనంపై నుంచి దూకడంతో తీవ్రగాయాలైనట్లు సమాచారం. విశ్వసనీయ సమాచారం మేరకు.. నెల్లూరు రూరల్ మండలం ములుమూడిలో నిర్మాణంలో ఉన్న ఓ భవనంలో ఆదివారం పేకాటాడుతున్నారన్న పక్కాసమాచారం నెల్లూరు రూరల్ పోలీసులకు అందింది. ఎస్‌ఐ నేతృత్వంలో ఇద్దరు సిబ్బంది పేకాట కేంద్రంపై దాడి చేశారు. పోలీసుల రాకను గమనించిన జూదరుల్లో ఓ యువకుడు పోలీసుల నుంచి తప్పించుకునేందుకు భవనంపై నుంచి దూకే క్రమంలో ప్రహరీ గోడపై పడ్డాడు. దీంతో అతనికి తీవ్రగాయాలయ్యాయి. పోలీసులు అతన్ని హుటాహుటిన చికిత్స నిమిత్తం నగరంలోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌కు తరలించి చికిత్స చేయిస్తున్నట్లు సమాచారం. ఈ విషయం బయటకు పొక్కకుండా సదరు పోలీసు అధికారులు గోప్యంగా ఉంచినట్లు తెలుస్తోంది. గాయపడిని యువకుడికి ఆరునెలల కిందటే వివాహమైనట్లు తెలిసింది. ఈ ఘటనపై పూర్తి వివరాలు తెలియరావాల్సి ఉంది.

ఎనీవేర్ అక్రమాలు

జిల్లాలో రిజిస్ట్రేషన్‌శాఖ అవినీతికి కేరాఫ్‌గా మారింది. అన్ని హక్కు పత్రాలతో క్రయవిక్రయాల కోసం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలకు వెళ్లినా.. అధికారులకు ఇవ్వాల్సిన మామూళ్లు ముట్టజెప్పాల్సిందే. లేదంటే సవాలక్ష కొర్రీలు వేస్తూ రిజిస్ట్రేషన్లకు మోకాలడ్డుతున్నారు. ఇక ఏ హక్కుపత్రాలు లేకుండా రిజిస్ట్రేషన్ కోసం వెళ్తే సబ్ రిజిస్ట్రార్లకు కాసుల పంటే. ప్రభుత్వ భూములు, పరాయి వ్యక్తుల భూములకు అక్రమ రిజిస్ట్రేషన్లు అయితే చెప్పనక్కర లేదు. అక్రమార్కులకు అడ్వైజర్లుగా వ్యవహరించి ఇలాంటి ఆస్తుల రిజిస్ట్రేషన్‌కు 'ఎనీవేర్' అవకాశాన్ని ఆయుధంగా వాడుకుంటూ లీగల్‌గా దొరకకుండా తప్పులు చేస్తున్నారు. ఇలాంటి తప్పులు ఎత్తి చూపాల్సిన ఆడిట్ శాఖ కూడా అక్రమాల్లో పాలు పంచుకోవడం వల్లే జిల్లాలో అక్రమ రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయి.



జిల్లాలో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు : 11

రోజువారీ రిజిస్ట్రేషన్లు : 200 పైగా

ఏడాదికి ప్రభుత్వ ఆదాయం రూ.600 కోట్లు

- ప్రభుత్వ ఆదాయానికి గండికొట్టేలా అధికారుల తీరు
- స్టాంప్ డ్యూటీ ఎగనామం పెట్టేందుకు అడ్డదారులు
- ఎనీవేర్ సిస్టమ్ ద్వారా అక్రమ రిజిస్ట్రేషన్లు
- సీతారామపురంలో ప్రభుత్వ భూమికి రిజిస్ట్రేషన్
- అక్రమాలను గుర్తించని ఇంటర్నల్ ఆడిట్ విభాగం

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: జిల్లాలోని రిజిస్ట్రేషన్ శాఖలో సబ్ రిజిస్ట్రార్ల నుంచి ఆడిట్ అధికారుల వరకు.. డిస్ట్రిక్ట్ రిజిస్ట్రార్ నుంచి డీఐజీ వరకు అవినీతిలో మునిగి తేలుతున్నారు. తెలిసీ తప్పులు చేస్తూనే.. తమ అవినీతిని కప్పిపుచ్చుకునేందుకు మా దృష్టికి రాలేదు.. విచారించి కఠిన చర్యలు తీసుకుంటామంటూ నిజాయితీ మాటలు మాట్లాడుతున్నారు. ఇక ఆడిట్ అధికారులైతే కోడి పిల్లలను తిన్న గద్దలను తినే రాబందుల్లా తయారయ్యారు. అవినీతికి పాల్పడిన సబ్ రిజిస్ట్రార్ల వద్ద మరింతగా ముడుపులు తీసుకుని అక్రమ రిజిస్ట్రేషన్లను సక్రమ రిజిస్ట్రేషన్లుగా సర్టిఫికెట్ ఇస్తున్నారు. జిల్లాలో 11 సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి. భూములు, స్థలాల రిజిస్ట్రేషన్లతో పాటు భూముల ఈసీలు, డాక్యుమెంట్లు నకళ్లు, జనరల్ పవరాఫ్ అటార్నీ (జీపీ), వీలునామా, మ్యారేజ్ రిజిస్ట్రేషన్ జరుగుతుంటాయి. అయితే ప్రతి దానికి ప్రభుత్వానికి చెల్లించాల్సిన రుసుంతో పాటు అదనపు దోపిడీ పక్కా జరుగుతుందని ఆరోపణలు ఉన్నాయి. ఇలా రోజంతా చేసిన వసూళ్లను సాయంత్రానికి ఉద్యోగి నుంచి అధికారి వరకు స్థాయిని బట్టి ఎవరికి వారు వసూలైన నగదును పంపకాలు చేసుకోని వెళ్లడం షరా మాములుగా మారింది.

కమర్షియల్ భూమిని వ్యవసాయ భూమిగా చూపించి..

జిల్లాలోని ఇందుకూరుపేట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం పరిధి నారాయణరెడ్డిపేటలో సర్వే నంబర్ 400లో దాదాపు ఎనిమిది ఎకరాల భూమి ఉంది. అదే సర్వే నంబర్‌లోని 58 సెంట్లు భూమికి గతంలో రిజిస్ట్రేషన్ అయింది. తాజాగా ఇందులో రెండెకరాల భూమిని ఎనీవేర్ ద్వారా రాపూరు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. అయితే ఇందులో ట్విస్ట్ ఏమిటంటే ఆ భూమిని ఇందుకూరుపేట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేయించడం కోసం వెళితే అక్కడ సబ్‌రిజిస్ట్రార్ అభ్యంతరం పెట్టారు. ఆ సర్వే నంబర్‌లో గతంలో రిజిస్టర్ అయిన 58 సెంట్ల భూమిలో పాఠశాల భవనాలు, ఇతరత్రా వాణిజ్య సముదాయాలు ఉన్నాయి. ప్రస్తుతం ఆ భూమిని వ్యవసాయ భూమిగా చూపి రిజిస్ట్రేషన్ చేయలేనని వారం రోజుల పాటు తిప్పుకుని ఓ ఉచిత సలహా ఇచ్చారు. స్టాంప్ డ్యూటీ ఎగనామం పెట్టేందుకు సదరు కొనుగోలుదారులు, సబ్ రిజిస్ట్రార్ పెద్ద స్కెచ్ వేశారు. మార్కెట్ విలువ సర్టిఫికెట్ ఇస్తానని, రాపూరులో రిజిస్ట్రేషన్ చేయించుకుంటే తాను అప్రూవల్ ఇస్తానని చెప్పినట్లు సమాచారం. ఆ మేరకు కొనుగోలుదారులు రాపూరులో రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. ఇందుకు రూ.లక్షల్లో నజరానా పుచ్చుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

రూ.10.39 లక్షల స్టాంప్ డ్యూటీ ఎగనామం

నారాయణరెడ్డిపేటలోని సర్వే నంబర్ 400 కమర్షియల్ భూమిగా కన్వెర్షన్ అయింది. వాస్తవంగా చదరపు అడుగు మార్కెట్ విలువ ప్రకారం రూ.1,700 ఉంది. ఈ లెక్కన ఆ భూమికి రిజిస్ట్రేషన్‌శాఖ నిర్ణయించిన విలువ రూ.1,64,56,000. దీనికి స్టాంప్ డ్యూటీ 7.5 శాతం కింద ప్రభుత్వానికి రూ.12,34,400 వసూలు చేయాలి. అయితే ఆ భూమి వ్యవసాయ భూమిగా చూపించి కేవలం రూ.1.95 లక్షల స్టాంప్ డ్యూటీతో రాపూరు సబ్ రిజిస్ట్రార్ ఈ ఏడాది జనవరిలో డాక్యుమెంట్ నంబర్ 108/2023 ద్వారా రిజిస్ట్రేషన్ చేశారు. ప్రభుత్వానికి స్టాంప్ డ్యూటీ ఎగ్గొట్టడానికే ఇందుకూరుపేట, రాపూరు సబ్ రిజిస్ట్రార్లతో భారీ డీల్ కుదుర్చుకుని, తమ జేబులు నింపుకుని రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేశారు. ఈ క్రయవిక్రయం రిజిస్ట్రేషన్ ద్వారా రూ.10,39,400 స్టాంప్ డ్యూటీ మొత్తం ప్రభుత్వ ఖజానాకు చిల్లు పడింది.

ప్రభుత్వ భూమికి రిజిస్ట్రేషన్

ఉదయగిరి సబ్‌రిజిస్ట్రార్ అధికారులు ఏకంగా ప్రభుత్వ భూమికి అడ్డగోలుగా రిజిస్ట్రేషన్ చేశారు. రిజిస్ట్రేషన్ చేసే క్రమంలో కనీస నిబంధనలు పాటించలేదు. హక్కుపత్రాలు లేని ఈ భూమికి సంబంధించి రెవెన్యూ అధికారుల సమాచారం తీసుకోకుండానే రిజిస్ట్రేషన్ చేయడం వెనుక భారీ డీల్ కుదిరినట్లు అర్థమవుతోంది. సీతారామపురంలో సర్వే నంబర్ 1లో 431 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఆ భూమిని కాజేసేందుకు కొందరు అక్రమార్కులు పన్నాగం పన్నారు. 40 ఎకరాల ప్రభుత్వ భూమిని ఒకరి నుంచి మరొకరు కొనుగోలు చేసినట్లు అగ్రిమెంట్లు సృష్టించారు. ఆ అగ్రిమెంట్ ఆధారంగా మరొకరికి 10 ఎకరాలు విక్రయించినట్లు అగ్రిమెంట్ చేసుకున్నారు. రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు న్యాయస్థానాన్నే బురిడీ కొట్టించేలా కొత్త స్కెచ్ వేశారు. అనుకున్న ప్రకారం రిజిస్ట్రేషన్ చేయలేదని కోర్టుకెళ్లారు. వారే లోక్‌అదాలత్‌లో రాజీపడి కాలపరిమితి నిర్ణయించుకుని రిజిస్ట్రేషన్ చేయిస్తానని ఒప్పుకున్నారు. న్యాయస్థానంలో జరిగిన ఒప్పందాన్ని అడ్డం పెట్టుకుని సబ్ రిజిస్ట్రార్ ప్రభుత్వ భూమికి రిజిస్ట్రేషన్ చేసేశారు. వాస్తవంగా రిజిస్ట్రేషన్ చేసే ఆ భూమి హక్కుపత్రాలు, లింక్ డాక్యుమెంట్లు, అడంగళ్, వన్‌బీ రికార్డులు పరిశీలించాలి. అందులో ప్రభుత్వ భూమి ఉంటే చేయకూడదు. కానీ ఉదయగిరి సబ్‌రిజిస్ట్రార్ మాత్రం ఆ భూమి ప్రభుత్వానిది అని తెలిసీ.. రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చా లేదా అని సీతారామపురం తహసీల్దార్‌కు లేఖ రాశారు. 15 రోజుల్లోగా సమాచారం అందించాలని కోరారు. కానీ సదరు సబ్‌రిజిస్ట్రార్ గడువు ముగియక ముందే లేఖ రాసిన తొమ్మిదో రోజే ప్రభుత్వ భూమికి డాక్యుమెంట్ నంబర్ 2473/2022 ద్వారా రిజిస్ట్రేషన్ చేశారు. ఈ అక్రమ రిజిస్ట్రేషన్‌పై ఉన్నతాధికారులకు ఫిర్యాదు అందడంతో విచారణ జరిపి సబ్‌రిజిస్ట్రార్ అవినీతికి పాల్పడినట్లు నిర్ధారించారు. సదరు సబ్‌రిజిస్ట్రార్‌పై చర్యలు తీసుకోమని సంబంధిత ఉన్నతాధికారులకు ఆదేశాలిచ్చారు. కానీ ఇంతవరకు చర్యలు లేవు.

కేసులు నమోదు చేయమన్నాం




సీతారామపురంలో ప్రభుత్వ భూమికి రిజిస్ట్రేషన్ జరిగిన విషయంపై తహసీల్దార్‌తో విచారణ చేయించాం. అందులో ఉదయగిరి సబ్‌రిజిస్ట్రార్ తప్పు చేసినట్లు గుర్తించాం. తప్పు చేసిన అధికారులపై పోలీస్‌స్టేషన్‌లో కేసులు నమోదు చేయమని ఆదేశాలిచ్చాం.

– రోణంకి కూర్మనాథ్, జేసీ, నెల్లూరు

ఫిర్యాదులు చేస్తే చర్యలు తీసుకుంటాం

జిల్లాలోని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అధికారులు అవినీతికి పాల్పడినట్లు తమకు ఫిర్యాదులు చేస్తే తప్పక చర్యలు తీసుకుంటాం. ఎవరైనా అదనంగా వసూళ్లకు పాల్పడితే విచారించి చర్యలు చేపడుతాం. నారాయణరెడ్డిపేట భూ రిజిస్ట్రేషన్‌పై విచారణ చేశాం. రిజిస్ట్రేషన్ అయిన భూమి పక్కనే, అదే సర్వే నంబర్‌లో స్కూల్ భవనం ఉంది. ఉదయగిరి సబ్‌రిజిస్ట్రార్‌పై చర్యలు తీసుకోమని ఆదేశాలిచ్చింది వాస్తవమే. కానీ ఆ సబ్‌రిజిస్ట్రార్‌కు నోటీసు ఇచ్చాం. త్వరలోనే చర్యలు తీసుకుంటాం.

– బాలాంజనేయులు, జిల్లా రిజిస్ట్రార్



అడ్మిషన్లకు బంపర్ ఆఫర్లు

టెన్త్ పరీక్షలకు ముందే ఇంటర్ కళాశాలల ప్రలోభాల పర్వం



కమర్షియల్‌గా మారిపోయిన కార్పొరేట్ కళాశాలలు.. ఇప్పుడు బంపర్ ఆఫర్లతో విద్యార్థులకు వల విసురుతున్నారు. అడ్వాన్స్ కట్టి సీటు ముందుగానే బుక్ చేసుకుంటే ఫీజు రాయితీలంటూ కళాశాలల పీఆర్వోలు తల్లిదండ్రులకు ఫోన్లు చేసి అయోమయానికి గురి చేస్తున్నారు. ఒక్కొక్క కళాశాల యజమాన్యం ఒక్కొక్క రకంగా ఆఫర్లు ప్రకటిస్తుండడంతో తలలు పట్టుకుంటున్నారు. ఇప్పటికే సగం సీట్లు భర్తీ అయిపోయినట్లు చెబుతూ ప్రచారం చేసుకుంటున్నారు. కళాశాలలో చేరక ముందే ఎన్నో ఆఫర్లు ఇస్తున్నారు.. చేరాక ఆ ఫీజులు, ఈ ఫీజులు అంటూ తమ లక్ష్యం మేరకు గుంజేస్తున్నారు. అప్పుడు అలా చెప్పారంటే.. అవును చెప్పినట్లే మీకు రాయితీ ఇచ్చాం.. ఇవి మాత్రం అందరికీ కామనే అంటూ తల్లిదండ్రులకు చుక్కలు చూపిస్తున్న పరిస్థితి అన్ని కళాశాలల్లో నెలకొంది.

- ఇప్పుడే అడ్వాన్స్ చెల్లిస్తే ఫీజులో 20 శాతం రాయితీ
- అడ్మిషన్ల కోసం కళాశాలల యాజమాన్యాల ఆరాటం
- పీఆర్వోల ఫోన్లతో అయోమయంలో తల్లిదండ్రులు
- సిబ్బందికి యాజమాన్యాల టార్గెట్లు
- ఒక్కో విద్యార్థిని చేరిస్తే ఫీజును బట్టి రూ.5 వేలు నుంచి రూ.10 వేలు కమీషన్

నెల్లూరు (టౌన్): మా కాలేజీలో చేరితే ఐఐటీ, నీట్ ప్రవేశాలకు జేఈఈ అడ్వాన్స్‌డ్, జేఈఈ మెయిన్స్ పరీక్షలకు సర్వసన్నద్ధం చేస్తామంటూ తల్లిదండ్రులను ఇంటర్ కళాశాలల యాజమాన్యాలు మభ్య పెడుతున్నాయి. మంచి ర్యాంక్‌లు రావాలంటే మా కాలేజీ బెస్ట్ అంటూ ఆయా కళాశాలల్లో ముందస్తుగా సీటును రిజర్వు చేసుకోవాలని యాజమాన్యాలు విద్యార్థుల తల్లిదండ్రులను అయోమయానికి గురి చేస్తున్నాయి. ఇంటర్, ఎంసెట్, నీట్, ఐఐటీల్లో సీట్లు కోసం ఆయా కళాశాలల యాజమాన్యాల ఒక్కో పేరుతో ఒక్కో కోర్సును నిర్వహిస్తున్నారు. కోర్సును బట్టి రూ.35 వేల నుంచి రూ.1.50 లక్షల వరకు ఫీజులు వసూలు చేస్తున్నారు. అదే హాస్టల్ అయితే గది, భోజనాన్ని బట్టి రూ.70 వేల నుంచి రూ.1.20 వేల వరకు అదనంగా వసూలు చేస్తున్నారు. దీంతో పాటు ఏటా 15 నుంచి 20 శాతం ఫీజును ఆయా యాజమాన్యాలు పెంచుతున్న పరిస్థితి ఉంది. ముందస్తు అడ్మిషన్ కోసం సీటు రిజర్వేషన్ చేసుకుంటే మొత్తం ఫీజులో 20 శాతం రాయితీ కల్పిస్తామని చెబుతున్నారు. ఇప్పుడు సీటు రిజర్వేషన్ కోసం కోర్సును బట్టి రూ.5 వేల నుంచి రూ.10 వేలు అడ్వాన్స్ చెల్లించాలని చెబుతున్నారు. ఇప్పటికే పేరున్న జూనియర్ కళాశాలల్లో 50 శాతానికి పైగా అడ్మిషన్లు పూర్తయినట్లు ప్రచారం చేసుకుంటూ.. విద్యార్థుల తల్లిదండ్రులను మాయ చేస్తున్నారు.

ఇంటర్‌బోర్డు అధికారుల మౌనం


ప్రభుత్వ నిబంధనల ప్రకారం విద్యా సంవత్సరం ముగిసిన తర్వాత మళ్లీ విద్యా సంవత్సరానికి అడ్మిషన్లు చేసుకోవాల్సి ఉంది. అయితే జిల్లాలో యథేచ్ఛగా ముందుగానే రాయితీల పేరుతో విద్యార్థులను, తల్లిదండ్రులను మభ్య పెడుతున్నప్పటికీ ఇంటర్‌బోర్డు అధికారులు నోరు మెదపకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జిల్లాలో మొత్తం 208 ప్రభుత్వ, ప్రైవేట్ జూనియర్ కళాశాలలు ఉన్నాయి. వీటిల్లో ప్రభుత్వ 26, ప్రైవేట్, కార్పొరేట్‌కు సంబంధించి 182 కళాశాలలె ఉన్నాయి. అయితే 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి ఆయా ప్రైవేట్, కార్పొరేట్ జూనియర్ కళాశాలల్లో ముందస్తు అడ్మిషన్లు జోరందుకున్నాయి. పదో తరగతి పరీక్షలు ఏప్రిల్ 3వ తేదీ నుంచి నిర్వహించేందుకు రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ షెడ్యూల్‌ను విడుదల చేసింది. ఈ పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా 29,691 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. పరీక్షలకు ఇంకా 50 రోజులకు పైగా సమయం ఉంది. అప్పుడే ఇంటర్ కళాశాలల యాజమాన్యాలు నూతన అడ్మిషన్లకు తెర లేపాయి. ప్రతి రోజు పదో తరగతి చదువుతున్న పిల్లల తల్లిదండ్రులకు ఆయా కళాశాలల యాజమాన్యాల నుంచి ఫోన్లు వస్తున్నాయి. కళాశాలలో సీటుకు అడ్వాన్స్ చెల్లిస్తే ఫీజు రాయితీ ఇస్తామని తల్లిదండ్రులను మభ్యపెడుతున్నాయి.

నగరంలోని సుబ్బారావు (పేరు మార్పు)కు ఓ కళాశాల యాజమాన్యం నుంచి ఫోన్‌కాల్ వచ్చింది. 'మీ అబ్బాయి 10వ తరగతి చదువుతున్నాడు కదా, ఇంటర్ మా కళాశాలలో చేర్పించండి. ఇప్పుడే అడ్మిషన్ పొందితే 20 శాతం రాయితీ ఇస్తాం. మా కళాశాలకు మంచి డిమాండ్ ఉంది. సీట్లు భర్తీ అయితే ఫీజు ఎక్కువ చెల్లిస్తామన్న సీట్లు దొరకవు. ఇప్పుడైతే కోర్సును బట్టి రూ.5 వేల నుంచి రూ.10 వేలు అడ్వాన్స్ చెల్లిస్తే మీ సీటు రిజర్వేషన్ చేసుకుంటే అడ్మిషన్‌కు ఎలాంటి ఇబ్బంది ఉండదు' అంటూ ఆఫర్లు చెప్పాడు. ఇప్పుడే నేనేమీ చెప్పలేనని సుబ్బారావు చెప్పినా.. ఇంకా మీకు కొన్ని ఫీజుల్లో రాయితీలు ఇప్పించే బాధ్యత మాదంటూ ఆ కళాశాల పీఆర్వో చెప్పడంతో వారం తర్వాత చెబుతామని సుబ్బారావు ఆ సమయానికి తప్పించుకున్నాడు.

అధ్యాపకులు, సిబ్బందిపై ఒత్తిడి

ఆయా జూనియర్ కళాశాలల్లో పనిచేస్తున్న అధ్యాపకులు, సిబ్బందిపై యాజమాన్యాలు ఒత్తిడి పెంచుతున్నాయి. దీనికి తోడు అడ్మిషన్లు చేస్తే కొన్ని తాయిలాలు కూడా ప్రకటిస్తున్నారు. ఈ ప్రచారంలో నారాయణ, శ్రీచైతన్య, విశ్వసాయి, కృష్ణచైతన్య, ఎస్ఆర్, ఆర్ఎస్ఆర్ తదితర యాజమాన్యాలు ముందు వరుసలో ఉన్నాయి. ప్రతి కళాశాలలో అధ్యాపకులు, సిబ్బంది ఒక్కొక్కరు కనీసం 5 నుంచి 10 మందిని చేర్చాలని టార్గెట్ విధించారు. ఒక్కో విద్యార్థిని చేరిస్తే ఆయా కోర్సును బట్టి రూ.5 వేల నుంచి రూ.10 వేలు కమీషన్ ఇస్తామని ఆఫర్లు ప్రకటించారు. దీంతో అధ్యాపకులు, సిబ్బంది పదో తరగతి చదువుతున్న విద్యార్థుల ఫోన్లు నంబర్లను సేకరించే పనిలో ఉన్నారు. ఇందులో భాగంగా ముందుగా పాఠశాలలకు వెళ్లి మెరిట్ విద్యార్థుల జాబితాలను తీసుకుని ఏ విద్యార్థికి ఏ గ్రేడ్ వస్తుందో తెలుసుకుంటున్నారు. పట్టణాల్లో ఉద్యోగులు, వ్యాపారాలు చేస్తున్న పిల్లలను పసిగట్టి వారికి వల విసురుతున్నారు. అదే గ్రామీణ ప్రాంతాల్లో అయితే విద్యార్థులతో నేరుగా మాట్లాడి కళాశాలల్లో అడ్మిషన్ పొందేలా వారిని మభ్యపెడుతున్నారు. కొందరైతే గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులకు తక్కువ ఖర్చుతో బస్సు సౌకర్యాన్ని ఏర్పాటు చేస్తామని చెబుతున్నారు. అదే హాస్టల్ చేరినట్లయితే రాయితీ ఇస్తామని ప్రలోభాలకు గురి చేస్తున్నారు. పరీక్షల సమయంలో అధ్యాపకులు తరగతి గదులు వదిలి ప్రవేశాల కోసం పాట్లు పడుతున్నారు. ఆయా కళాశాలల నుంచి వచ్చే ఫోన్లుతో తమ పిల్లలను ఏ కళాశాలలో చేర్చాలో నిర్ణయించుకోలేక తల్లిదండ్రులు గందరగోళానికి గురవుతున్న పరిస్థితి ఉంది. కొందరైతే పది పరీక్షలు ప్రారంభం కావడానికి ఒకటిన్నర నెల ముందుగానే అడ్మిషన్లు గోల ఏంటంటూ మండి పడుతున్నారు.

ముందస్తు అడ్మిషన్లు నిర్వహిస్తే చర్యలు



2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి ఆయా కళాశాల యాజమాన్యాలు బోర్డు నుంచి షెడ్యూల్ విడుదల చేసిన తర్వాతే అడ్మిషన్లు చేసుకోవాల్సి ఉంది. కొన్ని యాజమాన్యాలు ముందుగానే అడ్మిషన్లు నిర్వహిస్తున్నారని ఫోన్లు చేసి ఫిర్యాదు చేస్తున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ముందస్తు అడ్మిషన్లు నిర్వహించకూడదు. ఇంటర్‌లో ప్రవేశాల కోసం కళాశాల నుంచి ప్రతినిధులు ఏ విద్యార్థి తల్లిదండ్రులకు ఫోన్లు చేయకూడదు. ఒక వేళ ఫోను చేసినట్లు రుజువైతే కళాశాల యాజమాన్యంపై బోర్డు నిబంధనలు ప్రకారం చర్యలు తీసుకుంటాం.

– వరప్రసాదరావు, ఆర్ఐఓ

కోటంరెడ్డిని తీసుకొస్తే తీవ్రపరిణామాలు

- అధిష్టానానికి రూరల్ నియోజకర్గ టీడీపీ నేతల అల్టిమేటం

నెల్లూరు (టౌన్): నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిని టీడీపీలోకి వద్దనే వద్దు, ఆయన్ను తీసుకువస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని ఆ పార్టీ రూరల్ నియోజకవర్గ ఇన్‌చార్జి అబ్దుల్ అజీజ్, నాయకులు హెచ్చరించారు. జలదంకి సుధాకర్, దొండపనేని రాజానాయుడు, పెంచలనాయుడు, షబీర్‌ఖాన్, రమేష్ చౌదరి, అల్లాబక్షు మాతంగి కృష్ణ తదితరులపై అక్రమ కేసులు పెట్టి వేధింపులకు గురి చేశారంటూ ఆ వేదన వ్యక్తం చేశారు. ఆదివారం టీడీపీ జిల్లా కార్యాలయంలో రూరల్ నియోజకవర్గ ఇన్‌చార్జి అబ్దుల్‌అజీజ్ ఆధ్వర్యంలో రూరల్ నాయకుల విస్తృత స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ శ్రీధర్‌రెడ్డిని టీడీపీలోకి చేర్చుకోవద్దని, అవసరమైతే చంద్రబాబు వద్దే తాడో పేడో తెల్చుకుందామంటూ నిర్ణయం తీసుకున్నారు. టీడీపీ నేతలపై కోటంరెడ్డి చేసిన దౌర్జన్యాలు, దాడులు అన్నీ.. ఇన్నీ కావన్నారు. అబ్దుల్‌అజీజ్ మాట్లాడుతూ క్రికెట్ బెట్టింగ్‌లు ఆడేవారిని, సింగిల్ నంబర్లు ఆడించే వారిని టీడీపీలోకి ఆహ్వానించమన్నారు. ఈ విషయంపై చంద్రబాబు, లోకేశ్‌లు స్పష్టంగా ఉన్నారని, టీడీపీ కార్యకర్తలపై దాడి చేసిన వారిని ఎట్టి పరిస్థితుల్లో వదిలేది లేదని చెప్పారు. శ్రీధర్‌రెడ్డి చేరిక సంభాషణ చంద్రబాబు, లోకేశ్ వద్ద ఉన్నాయన్నారు. టీడీపీ ప్రభుత్వం రాగానే కార్యకర్తలకు జరిగిన నష్టాలకు ప్రతీకారం తప్పకుండా ఉంటుందన్నారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి, రాష్ట కార్యదర్శి జన్ని రమణయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వరెడ్డి, నాయకులు గున్నయ్య, రాజానాయుడు, పెంచలనాయుడు, నరేంద్రరెడ్డి, సురేంద్రబాబు, సాబీర్‌ఖాన్, సుధాకర్, ఆసీఫ్ బాషా, మాతంగి కృష్ణ, భూలక్ష్మి, వెంకటరమణారెడ్డి, శ్రీహరి రెడ్డి పాల్గొన్నారు.



శ్రీధర్‌రెడ్డి రాకను వ్యతిరేకిస్తూ రూరల్ నియోజకవర్గం నుంచి హాజరైన కార్యకర్తలు

వెంగమాంబ అమ్మవారికి జలాదిపూజ



అమ్మవారికి సముద్ర స్నానం అనంతరం పూజలు చేస్తున్న అర్చకులు

కావలి రూరల్ : జిల్లాలో ప్రసిద్ధి చెందిన దుత్త లూరు మండలం, నర్రవాడ గ్రామంలో వెలసిన వెంగమాంబ పేరంటాల అమ్మవారికి కావలి రూరల్ మండలం కొత్తసత్రం సముద్రతీరం వద్ద జలాదిపూజా మహోత్సవం ఆదివారం నిర్వహిం చారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ ప్రతి మూడు సంవత్సరా లకు ఒకసారి అమ్మవారికి సముద్రస్నానం నిర్వహి స్తామని, అందులో భాగంగా అమ్మవారిని ఊరేగిం పుగా తీసుకువచ్చి జలాదిపూజ మహోత్సవం చేపట్టామన్నారు. కార్యక్రమానికి నెల్లూరు, ప్రకాశం జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి జలదిపూజ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు.

ఈ-క్రాప్ నమోదులో ముందంజ

ఈ-క్రాప్ నమోదు ప్రక్రియలో జిల్లా ముందంజలో ఉంది. వ్యవసాయ శాఖ అధికారులు ప్రతి గ్రామంలో పర్యటించి రైతులకు అవగాహన కలిగించి ఈ-క్రాప్ నమోదు ప్రక్రి యను వేగవంతం చేశారు. గత ఖరీఫ్ సీజన్‌లో ఈ-కేవైసీలో రాష్ట్ర స్థాయిలో జిల్లా ప్రథమ స్థానంలో నిలువగా ఈ ఏడాది ఈ-క్రాప్ నమోదులో జిల్లా ప్రథమ స్థానంలో నిలిపేలా అధికారులు చర్యలు చేపడుతున్నారు.

- రబీలో జిల్లా వ్యాప్తంగా 3.41 లక్షల ఎకరాల్లో నమోదు
- వ్యవసాయ పథకాలకు ఈ-క్రాప్ నమోదు తప్పనిసరి
- పూర్తిస్థాయిలో నమోదు చేసేలా వ్యవసాయాధికారుల చర్యలు



ఈ-క్రాప్ బుకింగ్‌ను పరిశీలిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు (ఫైల్)

నెల్లూరు(సెంట్రల్) : రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ రంగానికి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోంది. అర్హత ఉన్న ప్రతి రైతుకు సంక్షేమ పథకాలు అందాలనే లక్ష్యంతో ఈ-క్రాప్ బుకిం గ్‌ను ప్రభుత్వం అమలు చేస్తోంది. ఎక్కడా అవ కతవకలకు తావు లేకుండా, సాగు చేసే రైతులకు తప్పకుండా పథకాలు అందించాలనే లక్ష్యంగా చేపట్టిన ఈ-క్రాప్ బుకింగ్ నమోదు ప్రక్రియ జిల్లాలో ఊపందుకుంది.

ఈ-క్రాప్ నమోదు ఉంటేనే..

ప్రభుత్వం రైతుల కోసం వైఎస్సార్ రైతుభరోసా, సున్నావడ్డీ, పంటల బీమాతో పాటు అనేక వ్యవ సాయ సంక్షేమ పథకాలను అమలు చేస్తోంది. ఈ పథకాలు అందుకోవాలంటే వేసిన పంట వివరాలను ఈ-క్రాప్‌లో నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. ఈ విధంగా నమోదు చేసుకున్న రైతు లకు సాగు మొదలు పెట్టినప్పటి నుంచి విక్రయం చేసుకునే వరకు ప్రభుత్వం అందిస్తున్న ప్రతి వ్యవసాయ పథకం అందుతుంది.

గతేడాది రూ.5 లక్షల ప్రోత్సాహక బహుమతి

ఈ-క్రాప్ బుకింగ్, ఈ-కేవైసీలకు సంబం ధించి జిల్లా ముందంజలోనే ఉందని చెప్పాలి. గత ఏడాది ఖరీఫ్ సీజన్‌లో కూడా ఈ కేవైసీని జిల్లాలోని వ్యవ సాయశాఖ అధికారులు ముందుగా చేయడంతో రాష్ట్ర ప్రభుత్వ తరఫున రూ.5 లక్షల ప్రోత్సాహక బహుమతిని కూడా అందుకున్నారు. ఈ ఏడాది రబీ సీజన్‌కు సంబంధించి కూడా ఇప్పటికే ముందం జలో ఉండడంతో పాటు అవగాహన కార్య క్రమాలు చేస్తూ పూర్తి చేసే దిశగా ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు.

నమోదు వేగవంతం

జిల్లాలో ఈ-క్రాప్ నమోదు ప్రక్రియను వేగవంతం చేస్తున్నాం. ఎప్పటికప్పుడు రైతు భరోసా కేంద్రాల్లో ఉన్న వ్యవ సాయ శాఖ గ్రామ సహాయకులను, అటు రెవెన్యూ అధికారుల సహాయ సహకారాలతో త్వరగా పూర్తిస్థాయిలో చేపట్టే విధంగా చర్యలు చేపట్టాం. ఎక్క డైనా సమస్యలు ఉంటే స్థానిక రైతుల భరోసా కేంద్రంలో ఫిర్యాదులు చేయ వచ్చు.

– నర్సోజీ, వ్యవసాయశాఖ అధికారి

3.60 లక్షల ఎకరాల్లో సాగు అంచనా

ఉమ్మడి నెల్లూరు జిల్లాలో 97,774 మంది రైతులు 3.60 లక్షల ఎకరాలను సాగు చేసి నట్లు అధికారులు లెక్కలు వేస్తున్నారు. కాగా అనధికారికంగా మాత్రం దాదాపుగా 4.20 లక్షల ఎకరాల్లో సాగు చేసినట్లు తెలుస్తోంది. ఈ-క్రాప్ బుకింగ్ మాత్రం ఇప్పటి వరకు 3.41 లక్షల ఎకరాల్లో నమోదు చేశారు. మిగి లిన వాటిని ఈ-క్రాప్‌లో నమోదు చేసే విధంగా అధికారులు క్షేత్రస్థాయిలో రైతు లకు అవగాహన కల్పిస్తూ నమోదు ప్రక్రి యను చేపడుతున్నారు. కాగా ఈ క్రాప్‌లో నమోదు చేసిన రైతులు ఈ కేవైసీలో వేలిము ద్రలు వేయాల్సి ఉంటుంది. వీటితో పాటు రైతుల పూర్తి వివరాలను నమోదు చేయాల్సి ఉంటుంది. ఈ విధంగా కొన్ని సాంకేతిక సమస్యలను గ్రామాల్లోనే వీఏఏలు పరిష్క రించే పనిలో నిమగ్నమయ్యారు.

అదనపు కట్నం కోసం వేధింపులు

- రెండో వివాహం చేసుకున్న భర్త
- మొదటి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : అదనపు కట్నం కోసం ఓ వ్యక్తి మొదటి భార్యను వేధించి చివ రకు రెండో వివాహం చేసుకున్నాడు. దీంతో మొదటి భార్య దిశ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. కోట మండలం, వెంకన్నపాళేనికి చెందిన కాపులూరు పల్లవి అనే మహిళకు సం గం మండలం అరవపాళేనికి చెందిన వినోద్ కుమార్‌తో గత ఏడాది ఫిబ్రవరి 18వ తేదీన పెద్దల అంగీకారంతో వివాహం జరిగింది. ఆ సమయంలో పల్లవి తల్లిదండ్రులు 12 సవర్ల బంగారు ఆభరణాలు, రూ.4 లక్షల విలువైన ప్రామిసరీ నోటు రాసి ఇచ్చారు. అయితే గత కొద్దికాలంగా పల్లవి భర్త వినోద్‌కుమార్, మామ సుబ్బయ్య, అత్త నాగమణి, మరిది మహేష్, అతని భార్య వినీల, ఆడబిడ్డ అనూష అదనపు కట్నం కోసం వేధించ సాగారు. దీంతో కొద్ది రోజుల క్రితం పెద్దల సమక్షంలో వీరి మధ్య రాజీ ప్రయత్నాలు జరిగాయి. అయిన ప్పటికీ అత్తింటి వేధింపులు ఆగకపోగా రూ.50 లక్షల అదనపు కట్నం కావాలని, లేకుంటే విడాకులు ఇవ్వాలని పల్లవిని బెదిరించ సాగారు. చివరకు వినోద్‌కుమార్ ఇటీవల రెం డో పెళ్లి చేసుకున్నాడు. ఈ మేరకు ఆదివారం పల్లవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు నెల్లూరు దిశ పోలీస్‌స్టేషన్ విచారణ అధికారి శేఖర్‌బాబు కేసు నమెదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జిల్లాలో ఎన్నికల నియమావళి

- అతిక్రమిస్తే చర్యలు తప్పవు

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యం లో జిల్లాలో ఎన్నికల నియమావళి అమలు అవుతోందని జిల్లా ఎస్పీ సీహెచ్ విజయారావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నియమావ ళిని ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎటువంటి ధర్నాలు, ర్యాలీలకు అనుమతి లేదన్నారు. నిబం ధనలు అతిక్రమించిన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.

బాలిక అదృశ్యంపై ఫిర్యాదు

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : ఓ మైనర్ బాలిక అదృశ్యం కావడం పై పోలీసులు కేసు నమెదు చేశారు. ఈ ఘటన ఆదివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పొదలకూరు రోడ్డు ప్రాంతానికి చెందిన అంకమ్మ అనే మహిళ భర్త మృతి చెందడంతో నెల్లూరు నగరంలోని చేపల మార్కెట్‌లో చేపలు కొనుగోలు చేసి సారాయి అంగడి సెంటర్ వద్ద వాటిని అమ్ముకుంటూ జీవనం సాగిస్తోంది. ఎనిమిదో తరగతి చదివే తన కుమార్తె స్థానికంగా ఉన్న తిరుమల అనే వ్యక్తితో కొన్ని రోజుల క్రితం సన్నిహితంగా ఉండడాన్ని తల్లి గుర్తించింది. దీంతో అంకమ్మ తన కుమార్తెను చదువు మానిపిం చి చేపలు అమ్ముకునేందుకు తీసుకెళ్తుండేది. ఈ క్రమంలో ఆది వారం ఉదయం 7 గంటల ప్రాంతంలో సారాయి అంగడి సెం టర్ వద్ద చేపలు అమ్ముతున్న సమయంలో అంకమ్మ కుమార్తె పక్కనే ఉన్న అంగడికి వెళ్లి వస్తానని చెప్పి వెళ్లి ఎంతకీ తిరిగి రాలేదు. దీంతో చుట్టుపక్కల వారిని విచారించినా ఆచూకీ తెలి యకపోవడంతో తిరుమల అనే వ్యక్తిపై అనుమానం ఉందం టూ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు దర్గామిట్ట పోలీ సులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

స్పందనలో రెడ్‌క్రాస్ వలంటీర్ల సేవలు

నెల్లూరు (అర్బన్) : కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం కలెక్టర్ చక్రధర్‌బాబు ఆధ్వర్యంలో జరిగే స్పందన కార్యక్రమంలో రెడ్‌క్రాస్ వలం టీర్లు సేవలందిస్తారని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా కమిటీ కార్యదర్శి మస్తానయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తమ వలంటీర్లు వయోవృద్ధులు, దివ్యాంగులను అధికారుల వద్దకు వీల్‌చైర్‌లో తీసుకుని పోవ డం, నిరక్షరాస్యులకు అర్జీలు రాసివ్వడం, అర్జీ దారులకు రసీదు అందే ప్రదేశాన్ని చూపడం వంటి కార్యక్రమాలు చేస్తారన్నారు. ఈ సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కాదల్చుకున్న రెడ్‌క్రాస్ లైఫ్ మెంబర్స్ రెడ్‌క్రాస్ ఆఫీసులో సం ప్రదించాలన్నారు. వివరాలకు 96471 08108 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

గనుల శాఖ జిల్లా అధికారిగా సూర్యచంద్రరావు

నెల్లూరు(సెంట్రల్) : గనుల శాఖ జిల్లా అధి కారిగా సూర్యచంద్రరావు బాధ్యతలు నిర్వహించనున్నారు. ప్రస్తుతం ఇక్కడ ఏడీగా ఉన్న శ్రీనివాసరావును తిరుపతి జిల్లా గూడూరుకు బదిలీ చేశారు. తిరుపతి జిల్లా గూడూరులో ఇంత వరకు మైనింగ్‌శాఖ ఏడీ కార్యాలయం లేదు. తాజాగా నెల్లూరులోని ఏడీ కార్యాలయాన్ని గూడూరుకు తరలిం చారు. నెల్లూరులో ఉన్న మైనింగ్ డీడీ కార్యా లయం ఇక నుంచి జిల్లా మైనింగ్ శాఖ కార్యాల యంగా పనిచేస్తుంది. జిల్లా అధికారిగా సూర్య చంద్రరావు కొనసాగనున్నారు. ఈ నెల 15 నుంచి పూర్తి స్థాయిలో ఏడీ కార్యాలయం తర లిపోనుంది.

దర్గా పీఠాధిపతి అరెస్ట్



హఫీజ్ పాషా

అనుమసముద్రంపేట : ఏఎస్‌పేటలోని హజరత్ నాయబ్ రసూల్ దర్గా పీఠాధిపతి హఫీజ్ పాషాను హైదరాబా ద్‌లో ఆదివారం పోలీ సులు అరెస్ట్ చేశారు. స్థానికులు తెలిపిన సమాచారం మేరకు.. గత కొన్ని సంవత్సరాలుగా హజరత్ నాయబ్ రసూల్ దర్గాలో హఫీజ్ పాషా పీఠాధిపతిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్ నగరంలోని లంగర్‌హౌస్ ప్రాంతానికి చెందిన ఫాతిమా అనే మహిళను వివాహం చేసుకుం టానని మోసం చేశాడంటూ హఫీజ్ పాషాపై లం గర్‌హౌస్ పోలీస్‌స్టేషన్‌లో ఆమె ఆదివారం ఫిర్యాదు చేసింది. దీంతో తెలంగాణ పోలీసులు ఆయన్ను అరెస్ట్ చేసినట్లు సమాచారం.

రైలు ఢీకొని మహిళ మృతి

వెంకటాచలం : రైలు ఢీకొని గుర్తు తెలియని మహిళ మృతిచెందిన ఘటన వెంకటాచలం రైల్వేస్టేషన్ వద్ద ఆదివారం చోటుచేసుకుంది. రైల్వే పోలీసుల వివరాల మేరకు.. సుమారు 45 ఏళ్ల వయస్సు కలిగిన గుర్తు తెలియని మహిళ వెంకటాచలం రైల్వేస్టేషన్ వద్ద అప్‌లైన్ ట్రాక్‌లో ప్లాట్‌ఫారం నంబర్-3 వద్ద రైలు పట్టాలు దాటుతుండగా పాటలీపుత్ర ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మహిళ అక్కడికక్కడే మృతి చెం దింది. రైల్వేస్టేషన్ సిబ్బంది సమాచారం ఇవ్వ డంతో రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి, పోస్టు మార్టం నిమిత్తం జిల్లా ప్రభుత్వాస్పత్రికి తర లించి కేసు నమోదు చేశారు.

అంగన్‌వాడీలకు సౌర కాంతులు

- సీఎస్సార్ నిధులతో సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు



కొత్తపాలెం అంగన్‌వాడీ కేంద్రానికి అమరుస్తున్న సౌర విద్యుత్ పరికరాలు

ముత్తుకూరు : ముత్తుకూరు మండలం, నేలటూరులోని సెంబ్‌కార్ప్ ఎనర్జీ ఇం డియా (థర్మల్ ప్రాజెక్టు) లిమిటెడ్ ఆధ్వ ర్యంలో ప్రభుత్వ అంగన్‌వాడీ కేంద్రాలకు సౌర విద్యుత్ సౌకర్యాలను కల్పిస్తున్నారు. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సుబిలిటీ(సీఎ స్సార్) నిధులతో ముత్తుకూరు మండలం లో 10, తోటపల్లిగూడూరు మండలంలో 10 అంగన్‌వాడీ కేంద్రాలకు సౌర విద్యుత్ సౌకర్యం కల్పిస్తున్నారు. ప్రతీ కేంద్రం భవ నంపై ఒక కిలోవాట్ సామర్థ్యం కలిగిన సోలార్ రూఫ్ టాప్ సిస్టమ్‌ను ఏర్పాటు చేస్తున్నారు. ఈ సిస్టమ్ ద్వారా ఆయా కేం ద్రాల్లో బల్బులతో పాటు ఫ్యాన్లు కూడా పనిచేస్తాయి. ఈ మేరకు ప్రాజెక్టు సీఈఓ రాఘవ్ త్రివేది మాట్లాడుతూ, ముత్తుకూరు మండలంలో ఇప్పటికే ఏడు కేంద్రాలు, తోటపల్లిగూడూరు మండలంలో మూడు కేంద్రాల్లో సోలార్ రూఫ్ టాప్ సిస్టమ్ ఏర్పాటు పూర్తయింది. మిగిలిన కేంద్రాల్లో వీటి ఏర్పాటు చురుగ్గా కొనసాగుతోంది. సౌర విద్యుత్ సౌకర్యం పూర్తయితే ఏడాదికి రూ.84,000ల వరకు విద్యుత్ బిల్లులు ఆదా అవుతుందని అంచనా వేస్తున్నారు. సీఎ స్సార్ ద్వారా తాము మరిన్ని సేవా కార్యక్ర మాలు నిర్వహిస్తామని సీఈఓ చెప్పారు.



వరిగొండ కేంద్రానికి అమర్చిన సోలార్ రూఫ్‌టాప్



పైనాపురం కేంద్రానికి అమర్చిన సౌర విద్యుత్ సామగ్రి

హేచరీని ప్రారంభించిన మంత్రి విశ్వరూప్



హేచరీని ప్రారంభించిన అనంతరం మాట్లాడుతున్న మంత్రి, ఎమ్మెల్యేలు

ఉలవపాడు : మండల పరిధిలోని కరేడు పంచాయతీ, అలగాయపా లెంలో నూతనంగా నిర్మించిన శ్రీనివాస హేచరీని రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ ఆదివారం ప్రారంభించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడారు. హేచరీ ద్వారా నాణ్యమైన రొయ్య పిల్ల లను వ్యాపారులకు అందించాలని సూచించారు. ఈ ప్రాంతంలో హేచరీలు నిర్మించడం వల్ల వ్యాపారులకు సీడ్ అందుబాటులో ఉం టుందన్నారు. తొలుత నియోజకవర్గానికి విచ్చేసిన మంత్రి విశ్వరూ ప్‌కు ముమ్మడివరం ఎమ్మెల్యే పొన్నాడి సతీష్‌కుమార్, కందుకూరు ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి స్వాగతం పలికారు. వారికి శాలు వాలు కప్పి సత్కరించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొ న్నారు.

రిక్షా కార్మికుడి మృతి

- కేసు నమోదు చేసిన పోలీసులు



కాశీ మృతదేహం

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : నగరంలోని కనకమ హాల్ సెంటర్ వద్ద రోడ్డుపై ఓ రిక్షా కార్మికుడు మృతి చెందిన సంఘటన ఆదివారం చోటుచేసు కుంది. పోలీసుల కథనం మేరకు.. నగరంలోని సంతపేట కామాక్షినగర్ ప్రాంతానికి చెందిన పొందల కాశీ(60) అనే వ్యక్తి రిక్షా నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో నెల క్రితం కాశీకి విపరీతమైన దగ్గు, ఆయాసం రావడంతో రంగనాయకులపేటలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స చేసుకుని మందులు వాడుతున్నాడు. ఈ క్రమంలో ఆదివారం ఉదయం 11 గంటల సమ యంలో కాశీ తనకు తెలిసిన టీచర్‌కు హోటల్ నుంచి కూరలు తీసుకెళ్లి ఇచ్చి వస్తానని భార్య పెంచలమ్మతో చెప్పి వెళ్లాడు. మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో కనకమహాల్ సెంటర్ వద్ద రోడ్డుపై పడి పోయినట్లు భార్య పెం చలమ్మకు సమాచారం అందడంతో ఆమె ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించగా కాశీ అప్పటికే మృతి చెందాడు. గుండెనొప్పితో గానీ, ఇతర ఆరోగ్య సమస్యలతో మృతిచెంది ఉండొచ్చని పెంచలమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సంతపేట పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నెల్లూరు జీజీహెచ్‌కు తరలించి దర్యాప్తు చేస్తున్నారు.

పొదలకూరు నిమ్మధరలు (కిలో)

పెద్దవి	: రూ.54
సన్నవి	: రూ.43
పండ్లు	: రూ.18

పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్:	రూ.112
లేయర్	రూ.75
బ్రాయిలర్ చికెన్:	రూ.200
స్కిన్‌లెస్ చికెన్:	రూ.220
లేయర్ చికెన్:	రూ.128

